కథానిక:

# తుది ఘడియలు

శ్రీ తెన్నేటి సూరి

అంధకారం అరుస్తోంది—నిశ్శబ్దంగా.

గభీర, నిశ్శబ్దం — కాళరాత్రి.

కమిలిపోయిన కాళరాత్రి ముడతల్లో తోడేళ్లు మెసులుతున్నాయ్, అలికిడి లేకుండా.

క్లిక్—క్లిక్—క్లిక్—క్లిక్—

లప్— లప్— లప్— లప్—

వెలుగు వాహినులు కాళరాత్రి గర్భాన్ని భేదించుకుని నల్లని, ఓవర్‌కోట్ మీద కలుసుకుని, వలయాకారంగా, గుండ్రని వెలుగులమడుగు కోటు వెన్నుభాగం నడిమినుంచి వెలుగుచక్రం నెమ్మదిగా క్రిందికి దిగుతోంది. అంచులోనించి పైకి నెమ్మదిగా లేస్తోంది నికిల్ బందుల తోలు పెట్టె; బందులు చెలచెలా మెరిసినయ్.

"డాక్టరు!" "క్లిక్"మని తోడేలు టార్చిలైటు ఆర్పి, అంధకారంలోకి ఉఘ్న రహస్యంగా ఊదింది.

క్లిక్— క్లిక్— క్లిక్— వెలుగు వాహినులు ముడుచుకుపోయాయి...... దూరాన చీకటి ఎర్రగా నోరు తెరుచుకుంది. ఆ ద్వారంలోకి డాక్టరు ప్రవేశించాడు.

కొండిగట్టిన గోడచిమ్నీ, కొరివిదయ్యం నాలుకలా, సన్నగా, ఎర్రగా మండుతోంది. డాక్టరు నెమ్మదిగా గదిమూలకు .......... వెనుక గోడనించి చిమ్నీ తీసి చేతిలో పుచ్చుకుని, ఒక ఆజానుబాహుడు డాక్టరు వెనుక నడుస్తున్నాడు.

"పెద్దబ్బాయ్" అంటూ కలవరిస్తూ, పక్కమీద రోగి, గిజాటుగా, ఒత్తిగిలింది.

డాక్టర్ స్టెతస్కోప్ తీసి చెవులకు తగిలించుకుని "ఇలా తిరుగమ్మా" అంటూ రోగి చెయ్యి పట్టుకున్నాడు. "అమ్మా"... అన్న వాక్యం విని, రోగి ఉద్రేకంగా మంచం మీదనించి లేచి, "నాన్నా" అని కళవళంగా డాక్టర్ని కావిలించుకుంది. వొణుకుతున్న అరచేతులు డాక్టరు మెడను తడిమి చూసినయ్.

......"కాదూ?" అని కొయ్యబారిపోయినయ్. రోగి "ఉస్సురన్న"దెంచుగుపోయి, పక్కలోకి దిగజారిపోయింది. కంగారుపడ్డ డాక్టరు కాలు నిలుపుకుని, కల్లోలంగా, దీపంపుచ్చుకున్న ధీశాలి కనుబొమ్మల్లోకి వెర్రిచూపులు చూశాడు. ఆ వ్యక్తి, "హుఁ" పెద్దబ్బాయ్ "అరుణ" అనుకుందిలెండి. ఈ పూట ఉపిరితపిరిగానే వుంది"

"అరుణెవరు?"

"మా దొరగారి పెద్దబ్బాయ్"

"దాహం".. పక్కలో రోగి నిశ్వాసం విడిచింది. సుబ్బన్న చిమ్నీ అక్కడ పెట్టి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చాడు. నెమ్మ

దిగా రోగిని పైకి లేవతీసి, వెన్నాను కుర్చీమని గ్లాసు నోటి కందిస్తూ—

"అనవసరంగా ఖంగారుపడకు. నీకేమీ ఫరవాలేదు."

"అవునమ్మా, ఫరవాలేదు నేనున్నానుగా" అన్నాడు డాక్టరు.

"అరుణ తండ్రి రాలేదూ ?"

"ఇంటిచుట్టూ పోలీసు కాపలా కాస్తున్నారు" సుబ్బన్న సుబ్బలక్ష్మి చెవులో భయం భయంగా గుసగుసలాడాడు.

"హాఁ— అట్టాగా, అందుకా రాలేదు. సరే..." రోగి సమాధానపడి మనస్సు ఒక తీరానికి తెచ్చుకొని నెమ్మదిగా పక్కలో ఒదిగి పండుకుంది. ఆతల్లి పక్కలో డాక్టరు కూడా నెమ్మదిగా కూచున్నాడు. "వీలుచూసి అబ్బాయిని పిలిపించుదాం. కళ వళ పడబోకమ్మా మనస్సు పాడుచేసుగుంటే కష్టం"

"నేను బ్రతకను డాక్టరుగారూ! అబ్బాయిని చూడకుండా పోతానేమో నని ఆదుర్దాబడ్డా. నాకు ఏడుగురు బిడ్డలున్నా, వాళ్ళని చూడాలని నాకు బెంగగా లేదు. నాలుగు పాలచుక్కలిచ్చిన పాపానికి ఆ బిడ్డని, కత్తుల బోనుల్లోకి నడిపించాను. అలా ఎందుకు చేశానో నాకు నాకే అర్థంకాదు."

"నీకేమీ ఫరవాలేదమ్మా. మనస్సు కొంచెం ఖంగారైంది. అంతే. ఒక చిన్న ఇంజెక్షనిస్తాను హాయిగా వుంటుంది. — సుబ్బన్నా! ఉడుకులాంపట్టీ నుదురు మీద వెయ్యి......"

డాక్టరు ఇంజెక్షన్ చేశాడు. సుబ్బలక్ష్మికి కొంచెం హాయి చిక్కింది.

"డాక్టరుగారూ ? కొంచెం సేపు మాట్లాడాలని వుంది, నాకు ఇపుడు హాయిగానే వుంది. కొంచెం మాట్లాడొచ్చా ?"

"ఎక్కువ మాట్లాడ్డం మంచిదిగాదు... మళ్ళా హైరానవుతుంది."

"కొంచెంసేపు—నెమ్మదిగా మాట్లాడతాను."

"అరుణసంగతేగా ?...డాక్టర్ గారికి నే జెబుతాలే, నువ్వు కాసేపు కళ్ళు మూసుకు పడుకో—"

"అరుణసంగతి నువ్వేం జెబుతావ్ ?" ఒక్క ప్రాణంతో చవితి చంద్రుడులాగు ఒక సన్నని చిరునవ్వు సుబ్బలక్ష్మి పెదవుల మీద నెలపొడుపైంది.

డాక్టరు గ్రహించాడు: ఆ తల్లి హృదయంలో ఏదో ఒక గొప్ప ఆవేశం వుందనీ; అది బయటికి చెప్పేసుకుంటే గాని, ఆతల్లి హృదయవేదన తగ్గి హాయిగా నిద్రపోలేదనీ, అంత ఆవేశాన్ని అణచుకోమనటం అదీ మంచిది కాదనుకున్నాడు.

"సరే...ఆవిణ్ణే చెప్పనియ్యిసుబ్బన్నా ఫరవాలేదులే : కొంచెం అలా కులాసాగా మాట్లాడుకుంటేగాని హాయిగా వుండదేమో కూడాలే"

సుబ్బలక్ష్మి నెమ్మదిగా మాట్లాడుతోంది—

"డాక్టరుగారూ! మీరు ఎంత ధైర్యం చెబుతున్నా, నాస్థితి నాకు తెలుస్తోంది. నేను బ్రతకను; చచ్చిపోయేలోగా ఆ బిడ్డని చూడాలని నాప్రాణం పీకుతోంది. నేనాబిడ్డని సర్వవిధాలా నాశనం చేశాను.ఆపదలలోకి యీడ్చాను.సుఖంగా

మహారాజులా బ్రతకాలిసిన బిడ్డకి లేని పోని గంగ వెర్రులెత్తించాను"

"ఏమిటీ-"

"దాసుగారి పేరు మీరు వినేవుంటారు. హరికథలవీ చెబుతూవుంటారు?-"

"మీ దొరగారిసంగతేగా - మొన్న చూశానుగా"

"అవును మొన్న చూశారుగా-అన్నట్టు మరచిపోయాను. వారు ప్రశాస్తిగా సంగీతం పాడుతారు, కవిత్వం అదీ వ్రాస్తారు. రామాయణమంతా, హరికథగా వ్రాసి గొప్ప కీర్తి సంపాయించారు."

"అవును విన్నాను."

"వారియింటికి ముందు ఒక పెద్ద తల సావిడివుంది. ఆ తలసావిట్లో అహో రాత్రులూ, వీణలు, మద్దెళ్లూ, ఫిడేళ్లూ భోరు కొలిపి పోతూవుండేవి. ఆసావిట్లో ఎడంచేతివేపున కొంతభాగం అడ్డం కట్టి వుండేది; అందులో వర్షాకాలమన్ని రోజులూ రెండు భోగంమేళాలు దిగి కాచుకుతాగుతూ వుండేవాళ్లు-ఆ మూడు మాసాలూ దాసుగారి దగ్గిర ఆటా పాటా చెప్పకుని వర్షాలు వెలవంగానే ఊళ్ళమీద వెళుతూ వుండేవాళ్లు.

"ఇవతలప్రక్క సావిట్లో; ఒకనాటకం కంపెనీ వుండేది. హరిశ్చంద్రా, గయో పాఖ్యానం, మోహనవిజయం - అంటే 'ప్లీహ్వానారాయణరావు వధ' అంటారు చూడండి,ఆనాటకం మాఅయ్యగారు తెలుగులో వ్రాశారు.— ఈ నాటకాలు గరిడీ జెప్పుకుంటూ ఉండేవాళ్లు

"ఇంకా పది పన్నెండుమంది మంగలి పిల్లలూ ఆడపిల్లలూ, మా దొరగారి దగ్గర సంగీతం చెప్పుకుంటూండేవాళ్లు.

"అయ్యగార్ని చూట్టానికి ఎంతెంత దూరంనుంచో, పెద్ద పెద్ద విద్వాంసులు వొస్తూండేవారు. సాయంత్రమయేటప్పటికి ఆ సావిట్లో ఏదోవొక సంగీత కచేరియో, భరతనాట్యమో, వుండేది.

"మా వూళ్లో, వారికి మంచి పలుకుబడి వుంది. వూళ్లో నలుగురితో చెప్పి, ఆ వొచ్చిన విద్వాంసులికి, తృణమో ఫణమో ముట్టజెప్పి, సంతోషపెట్టి పంపుతూండే వారు.

"చైత్రం, వైశాఖం మాసాలు రెండూ, చింతావారి కూచిపూడి మేళం మావూళ్లోనే మకాం.

"శరభలింగానికి జంగంకథలో, కాలికి గండపెండేరం వేయించింది అయ్య గారే!"

"ఆ యింటిని కళాసరస్వతి విలాస మందిరంగా చేసుకున్నదల్లేవుంది. ఎంత చక్కని వాతావరణం! ఆవాతావరణంలో పెరిగితే, ఎలాంటివాళ్లయినా గొప్ప తేజో వంతులు అవడానికి అవకాశం వుంటుంది"

"ఆ,..... అదే చెప్పొస్తున్నా. ఒక తమాషా" అని సుబ్బన్న వంక చూసి సన్నగా చిరునవ్వు నవ్వింది.

"ఏం? మా వెంకప్ప సంగతి డాక్టరు గారికి చెప్పి, వేళాకోళం పట్టిద్దామనా?"

"మా మరిది అయ్యగారింట్లోపని చేస్తూ ఉండేవాడు. ఆ అబ్బాయి వాళ్ల మేన మామనీ. పినతండ్రి పెత్తండ్రి బిడ్డల్ని, పోగుచేసి, ఒక భాగోతంజట్టు తయారు

చేశాడు. చెబితే మీరు నమ్ముతారో, లేదో... ఆ అబ్బాయి సైరంధ్రివేషం వేసి, చీరా, రవికా కట్టుగుని, రొండిన చెయ్యిపెట్టుగు నుంచుంటే, అచ్చు మా అత్తయ్యలాగుండేవాడు."

డాక్టరు, "అరుణసంగతి చెబుతావను కున్నాను. ఇదంతా చెబుతున్నావేం? అంత హైరాన పడకూడదు."

"ఊఁ... అదే చెప్పబోస్తున్నాను—"

"ఈయన దొరగారి వ్యవసాయంమీద పనిపాటలు చేస్తూండేవారు. దొరగారే... మాపెళ్లి చేసింది. అప్పట్నుంచీ, నేను ఆ యింట్లోనే చాకిరీ చేస్తూ బ్రతికాను. ఆ యింట్లో తిరుగుతూంటే, నాకూ పాడాలని ఉత్సాహమేసింది. భరతనాట్యం చూస్తూవుంటే, నేర్చుగుంటే బాగుండు ననిపించేది. నవ్వుతారేమోనని సిగ్గుపడి, నాలోనేను ఇదౌతూ వుండేదానిని. చివరికి నాయనమ్మగారి దగ్గిర భగవద్గీతలు నోట చెప్పించుగున్నాను."

డాక్టరు ఆశ్చర్యపడ్డాడు. "నీకు చదువొచ్చా?"

"రాదు. ఆవిడికీరాదు. ఆవిడ బుచ్చమ్మగారని ఒకావిడదగ్గిర శ్లోకం అర్థంగూడా నోటనే చెప్పుకున్నారు. అట్టానే నేనూ చెప్పుకున్నాను."

"తమాషాగానే వుంది. వినాలనుంది. కాని, నువ్వు ఇప్పటికే చాలా అలసిపోయావ్. ఇంక ఎక్కువగా మాట్లాడటం మనకి మంచిదికాదు. అరుణ సంగతేదో చెబుతావనుకున్నాను. ఎందుకు— ఇదంతా చెబుతావ్..."

"అదే చెబుతున్నాను. మీకు విసుగ్గా వుందా ?"

"లేదు"

"హైరానపడతా వేమోనీ..."

"హాఁ మా దొరసానికి లేకలేక ఒక మొగబిడ్డ పుట్టాడు. అప్పుడే నాకూ, మొదటికానుపు. తల్లిదగ్గర పాలు లేక పోతే అరుణకూ్కడా, నేనే పాలిస్తూ ఉండేదాన్ని. ఒకరోజున బిడ్డకి పాలిస్తూ నడవాలో కూర్చున్నా. ఆ...రోజు నాకు ఇప్పటికీ జ్ఞాపకం.

దాసుగారి పినతండ్రి కొడుకు దాసు గారితో దెబ్బలాడుతున్నాడు. కటకటాల గదిలో దాసుగారు రామాయణం వ్రాస్తున్నారు, వెంకటనారాయణగారు గాంధీ గారి మాటమీద స్వారాజ్యంకోసం చదువు మానేసి ఇంటికొచ్చాడు. రోజూ పేపరు తెచ్చి, అన్నగారికి చదవి వినిపిస్తూండేవాడు. ఆయన ఆవేళ ఎంతో ఉక్రోషంగా అన్నగారితో దెబ్బలాడారు. "లలితకళలన్నీ మీ చేతులో పెట్టుకూ్కచున్నారు. అవసరపడితేజాతిని జాతినీ కదిలించి రణరంగంలోకి దూకించే శక్తులు మీదగ్గిరున్నాయి. కాని, లాభమేమిటి? మీవల్ల జాతికికావలసిన ప్రయోజనమేమీ లభించటంలేదు. మీరు ఈ ప్రజా పోరాటాలనే మీ గుర్తించకుండా' ఇప్పుడీ రామాయణమేమిటి ? మీబోటి పెద్దలంతా, శక్తివంతులంతా ఇలా నిర్లక్ష్యంగా వుండటమే మనజాతి యీ దౌర్భాగ్యస్థితికంతా మూలం. ఇంకా మనజాతి బానిసలుగా వున్నామంటే దానికి బాధ్యులు మీరే" అన్నారు

దాసుగారు రాసేరాసే కలం అక్కడ పెట్టి ఇలా సమాధానం చెప్పారు.—

"వెంకటీ! నువ్వన్నదంతా నిజం. కాని నా అసమర్థతను కూడా నువ్వు గుర్తించాలి. కళారూపాలన్నీ మాదగ్గిరున్నాయ్. కాని కావలసిన రాజకీయ సాంఘిక విజ్ఞానం మాదగ్గిర లేదు. ఇప్పుడు మేము దాన్ని సాధించగలుగుతామని తోచదు. మా చదువంతా అదో వానా కాలపు చదువు. ఈ కళారూపాన్ని మీ కందజేస్తాం. మీ నూతన విజ్ఞానాన్ని యీ శిల్పాల్లో పోతపోసుకుని జాతిని ముందుకు తీసుకుపోండి, అరుడిగి వొది లెయ్యాల్సిన స్థితిలో మమ్మల్నింకా ఏం చెయ్యమంటావ్."

అరుణ నా వొళ్ళో పాలు తాగుతున్నాడు. ఆబిడ్డవంక చూస్తే తండ్రి పోలికలన్నీ కనిపించినాయి. ఈ బిడ్డ, చదువుకుని ఈ రెండు చైతన్యాల్ని, పోత పోసుకుని ముందుకు నడుస్తాడనీ, మాబోటి కష్టజీవులకంతా అండగా నుంచుంటాడనీ ఒక ఆశ నాలో కలిగింది. అప్పట్నుంచీ, ఆ బిడ్డకు అదే దృష్టి వుండేటట్లు చూస్తూ వొచ్చాను. అనేక వెర్రిమాటలు చెప్పాను."

"సుఖమనేది "భ్రమ" అన్నాను. చుట్టూ వున్న జనం అన్నంలేక అటమటిస్తూ నరకకూపాల్లో బాధ పడుతూంటే, నీకు "సుఖ" మేమిటన్నాను. సుఖం కోసం జాతిదుస్థితి చూసుకోకుండా నడిచే వ్యక్తి "పిరికిపంద" అని పసిబిడ్డ రక్తాన్ని రెచ్చగొట్టాను. జాతి నుద్ధరించిన "మహాకవివై కలకాలం కీర్తినార్జించుకుని నక్షత్రాలున్నదాకా బ్రతకమని వెర్రిఆశలు చూపించాను ఆ బిడ్డకు గతి ఇప్పుడేమైందో, తెలుసా? తోడేళ్ళమధ్య లేడికూన బ్రతుకయింది, ఇంటిచుట్టూ ఆ పోలీసుల్ని చూశారా, నాలుగు ధారం పాలిచ్చి పెంచాననే వ్యామోహంతో చచ్చిపోతాననే బెంగతో వెంపర్లాడి బిడ్డ నన్ను చూట్టానికివొస్తే పట్టేసి ఉరికంబ మెక్కించాలని ఎలా కనిపెట్టుకున్నారో చూశారా?! అబ్బ...తల్లి వొడిలోనుంచి బిడ్డను లాక్కుపోయి చీరకు తినాలని చూసే ఈమనుషులు-ఏమిటి డాక్టరుగారు! నా మూలాన బిడ్డ యీ కత్తుల బోనులో ఇరుక్కుపోయాడని కన్నతల్లి ఎంత ఏడుస్తోందో......లోపల్లోపల. పైకి అనక పోయినా, బిడ్డను నేను పాడుచేస్తున్నాననేకోపం. బిడ్డమీద కోపంవొచ్చినప్పుడల్లా ఆ తల్లిచెక్కిళ్ళలో ఎర్రగా...నాకు కనుపించుతూనే వుండేది. అజ్ఞానం,...బిడ్డగొంతు కోశేశాను."

డాక్టరు ఉద్రిక్తుడై లేచినుంచున్నాడు. "క్షమించు తల్లీ! ఏదో వొక సామాన్య పేదరాలికి చికిత్స చేస్తున్నాననుకున్నాను. వీరమాతవని గుర్తించుకోలేక పోయాను. బిడ్డ నమస్కరిస్తున్నాడు. నన్ను కూడా అశీర్వదించుతల్లీ! చేతులు ముకుళించి నమస్కరిస్తాడు.

"అదేమిటి డాక్టరు గారూ! నేను తక్కువ కులంలో పుట్టాను. మీరు బ్రాహ్మలు. మీరలా నమస్కారం చెయ్యకూడదు, ఈ అపచారానికి లేచి, మీ పాదాలకి నమస్కరించాలిసింది. పక్కలోనించి లేవలేను. క్షమించండి - నమస్కరిస్తుంది

"ఇందులో నువ్వు విచారించవలసింది ఏమీలేదు తల్లీ! ఈ జాతిలో నీకీర్తి చిరస్థాయిగా వుంటుంది. అరుణను యోద్ధగా తయారుచేసి జాతికి అందించావు. తెలుగు దేశం నీకు ఋణపడివుంది"

"అంత పెద్దమాటలనకండి. నా బ్రతుకెంత... నేనెంత... కడుపులో బాధగా వుండి మీతో చెప్పుకున్నాను. ఇప్పుడే మిటో మనస్సులో కొంచెం చిక్కు తీసుకున్నట్టుగావుంది. నిద్దరొస్తోంది. కొంచెం పడుకోనా?"

"ఆ... విశ్రాంతి తీసుకో తల్లీ! నేను మళ్లా ఉదయం పొడవగానే వస్తాను."

సుబ్బలక్ష్మి నెమ్మదిగా కన్ను మూస్తోంది. డాక్టరు మందులుపెట్టె సర్దుకుని, బయలుదేరాడు.

ఇంతసేపూ, తన సర్వస్వాన్నీ కోల్పోతున్న దీనుడిలా తలుపు మొత్త నానుకుని కన్నీరు కారుస్తూ మోకాళ్లమీద తల వేలవేసుకుని కూచునున్నాడు సుబ్బన్న. డాక్టరుగార్ని వీధివాకిలిదాకా పంపించటానికి వెంట వెళ్లాడు. "బాబూ! ఈ పూట కొంచెం తెలివిగానే మాట్లాడుతోంది."

"ఊహ్...అని, నిస్పృహగా నవ్వాడు డాక్టరు. అరుణ ఎక్కడున్నాడు? నీకేమన్నా తెలుసా?"

"వూళ్లోనే తిరుగుతున్నాడుట. దీని కిల్లా వుందని ఆ పిల్లడు ఎంత కొట్టుకులాడుతున్నాడో!... తల్లి ఏమికన్నదో... ఇదే పెంచింది. ఆ పిల్లడు దీనిమీదే పంచప్రాణాలూ, పెట్టుకు బతుగుతూ వుంటాడు."

"ఒకసారి లోపలకొస్తే అవకాశముంటే బాగుండును"

"ఆమ్మో... ఆ... ఎదురుకుండా, డాబా అరుగుమీద చూశారా?"

టార్చిలైట్లు నాలుగూ, చక్కన వెలిగి, డాక్టరు మొహంమీద పడ్డయ్. "అబ్బా" అంటూ డాక్టరు బాధగా కళ్లు మూశాడు. మళ్లా నాలుగు లైట్లూ, ఒక్కసారి ఆరిపోయినయ్, అంధకారం అలుముకుపోయింది. కారుమేఘాలు దట్టంగా పట్టి, ఆ... కాళరాత్రి ఫెళ ఫెళా గర్జిస్తోంది. సన్నగా చినుకుకూడా సాగింది. డాక్టరు చకచకా, గేటు దాటి అంధకారగర్భంలోకి నడిచిపోయినాడు.

సుబ్బన్న నిస్పృహగా కాళరాత్రి గర్భంలోకి చూస్తూ, వరండాలో నుంచున్నాడు. అతనికి ప్రపంచమంతా ఏదో... తుఫానులో చిక్కుకుని నశించిపోతున్నట్లు భయమేసి; దిగాలుపడి చూస్తున్నాడు.

× × ×

జోరున కుంభవృష్టి కుమ్మరిస్తోంది. ఆకాశగర్భంలో జీమూతాలు పరుగులు తోలుతూ భయంకరంగా వుంది. ఆకాశం పెద్దపెట్టున ఫెళ ఫెళా విరిగి, మీదపడి పోయినట్టు ఒక్క ఉరుము ఉరిమింది. "గప్పు"మని మండి ధామ్మని వాళ్ల తోపుమీద గగనాన్నుంచి ఒకపిడుగు దూకింది. ఆ మంటతో ఆకాశం మరింత కమిలి కరుడుకట్టి పోయింది. హడలిపోయిన దిగ్భాగాలు హాహాకారంగా అర్చేసినయ్.

తడిసి నీళ్లుకారుతున్న వోవర్ కోటుతో హాటు మొహంమీదికి ముందుకు

దించుకుని డాక్టరు వర్షానపడి వొచ్చే స్తున్నాడు. రోడ్డుమీద మోకాలు బంటిగా పట్టిన నీళ్ళలో తొందర తొందరగా నడుస్తూ. బురదా, నీళ్లూ చింది రొమ్ముల దాకా కొట్టుకుంటున్నయ్. మళ్లా టార్చిలైట్లు డాబావరండాలో నుంచి డాక్టరు తోలుపెట్టిమీద పడి, ఆరిపోయినై.

"డాక్టర్..." అంటై ఒక తోడేలు.

"అది" చస్తోంది కావున్ను అప్పుడే ఆదుర్దాగా మళ్లా పరుగెత్తుకొస్తున్నాడు." అన్నది ఇంకో తోడేలు.

"దాని చావుగాదు మనచావుగా వుంది" మూడోది.

"పెద్దపెద్ద వాళ్లు పిలిస్తేనే పలికేడవడీ డాక్టరు. యీ కూలిదానికోసం యీ వుప్పెన్నబడి వొస్తున్నాడేమిటో"

"అరుణగాడికి అసలీ విషయం తెలుసునో లేదో...మనం అనవసరంగా చస్తున్నాము.

"వీళ్ళకి మటుకు ఎట్టా తెలిసేడుస్తుంది ? వాడెక్కడున్నాడో"

"అయినా ఇదంతా మన పిచ్చిగానీ, దీని అజ వాడికి పట్టిందటరా ?...

డాక్టరు తలుపు కొట్టాడు.

"ఎవరు ?"

"డాక్టరు"

"సుబ్బన్న కాశ్చర్యం వేసింది. వొచ్చి తలుపుతీసి చూశాడు. ఆ వ్యక్తి చెకచెకా లోపల ప్రవేశించాడు. ఓవర్ కోటూ హాటూ, తీసి దణ్ణెంమీద పారేశాడు.

"హాఁ... పెద్దబ్బాయ్...నువ్వా!..."

"ఇష్. తలుపు వేశై—అరుణపోయి సుబ్బలక్ష్మి పక్కలో కూచున్నాడు. సుబ్బలక్ష్మి చెయ్యితీసి నెమ్మదిగా పిసుగుతున్నాడు' "ఎంతచిక్కిపోయిందీ," అని తనలో తను బెంగపడుతూ...

ఆ స్పర్శతో సుబ్బలక్ష్మి, అరుణ చెయ్యి తడిమి చూసింది. "హా,... అరుణా,..."అంటూ చక్న కళ్లు విప్పి చూసింది.

"ఆ...నే...నే...అమ్మ"

"నానా,...చివాల్న లేచి కావిలించుకుని, వలవలా ఏడ్చింది.

చిక్కి శల్యమైపోయిన ఆతల్లి వెన్నుపాము నిమురుతూ కన్నీటితో కళవళంగా కుమిలిపోతున్నాడు.

ఆ... తల్లీ, బిడ్డా, పరస్పరం హృదయాలు పెనవేసుకుని ఒక్కక్షణం ఏకంగా నిరామయమై పోయారు. సుబ్బలక్ష్మికి చివాల్న ఒక స్ఫురణ కలిగింది. అతని బుజాలు రెండూ పట్టుకుని, "అదుగో" అంటూ తీవ్రంగా ముఖంలోకి చూసింది.

"ఏవిటే!"

ఎలా లోపలికొచ్చావ్ ? బయట వాళ్లు లేరూ?

"వున్నారు. డాక్టరుగారి డ్రస్ వేసుకొచ్చాను."

ఛెళ్లున చెంపమీద కొట్టింది ఆవేశంతో గజగజా వొణికిపోతూ— "ఏమిటి? ఏం పనిచేశావ్!. వాళ్లకి తెలిస్తే?......"

ఆతల్లికి తనమీద ఎంత ప్రేమవున్నదో అరుణకు అర్థమయింది. "తను వ్యర్థుడు. ఆ తల్లి ఋణం తె నెల్లాతీర్చుకుంటాడు? "కన్నీగారుతున్న కళ్లతో— పరవాలేదులే

అమ్మా" అంటూ నెమ్మదిగా పక్కమీద పడుకోపెట్టాడు.

అరుణ తొడమీద చెయ్యి పెట్టుకొని సుబ్బలక్ష్మి కన్నుమూసింది. ఒకక్షణానికి ఒక...ఎక్కిలి. "అబ్బ!..." అని మూలిగింది. అరుణ గుండెలమీద రాచాడు.

"నాన్నా!" సుబ్బలక్ష్మి జాలిగా అతని వంక చూసింది. కనుకొలకుల్లోనించి కన్నీళ్లు దిగజారినయ్.

"ఆయన ఏరీ?"

సుబ్బన్న ఆదుర్దాగా దగ్గరకొచ్చాడు.

చెయ్యి తడిమి "బిడ్డలు......" అని వలవలా ఏడ్చింది. సుబ్బన్న ప్రక్కమీద కూలబడిపోయాడు.

"అమ్మా!"

"నాన్నా!" అని చెయ్యిపట్టుకుని కళ్లు తెరిచి అతని మొహంలోకి చూసింది. ఆ జ్యోతులు రెండూ ఆరిపోయి ప్రపంచం చీకటిపడిపోయింది

# జాతీయగీతం

శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి

పవిత్రభారత సవిత్రికో హో
స్వతంత్రోత్సవం సాగింది
లాల్ కిలాపై అశోకచక్రపు
త్రివర్ణ కేతన మెగిరింది ॥పవిత్ర॥

మతం తలపక గతం తడవక
ద్వేషం రోషం సకలం మూడక
స్వతంత్రభారత జయపతాకకు
సోదరులారా మ్రొక్కండి ॥ప॥

నెత్తురు లోడ్చిన సత్తువ లూడ్చిన
పిశాచదాస్యం నశించిందనీ
ప్రపంచమంతా ప్రతిధ్వనింప
స్వతంత్ర శంఖా లూదండి ॥ప॥

పోరుల మ్రందిన కారలకుందిన
స్వతంత్రయోధులస్మరించుకొంటు
ముదశ్రుతర్పణ హృదంబుజార్పణ
స్వతంత్రులారా సలపండి ॥ప॥

అమోఘ శక్తుల సమీకరించుక
సమస్తభారత సమైక్యమెంచుక
హిమాద్రి మొదలు కుమారివరకు
భారతవిజయం పాడండి
స్వతంత్రభారత జయపతాకతో
యువతీ యువకులు నడవండి ॥ప॥